ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోటగిరి, మే 23: ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పొతంగల్ తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. పొతంగల్ మంజీరా నది నుంచి ఎలాంటి అనుమతి లేకుండా కొందరు వ్యక్తులు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు కోటగిరి సమీపంలో దాడులు చేసినట్లు పేర్కొన్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి, కోటగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని పొతంగల్ తహసీల్దార్ హెచ్చరించారు. తహసీల్దార్ వెంట గిర్దావర్ సాయిలు ఉన్నారు.

సర్టిఫికెట్ల అందజేత

డిచ్‌పల్లి, మే 23 : ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో గురువారం నిర్వహించిన టైలరింగ్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ మహేశ్వర్ కోలేటి హాజరై మాట్లాడారు. ఉమెన్స్ టైలరింగ్ మగ్గం వర్క్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, టూల్ కిట్స్ అందజేశారు. శిక్షణపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు రుణ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, రంజిత్, నవీన్, శ్రీలత, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీఎస్ఐ వెస్లీ చర్చిలో వార్షికోత్సవ వేడుకలు

డిచ్‌పల్లి, మే 23 : బర్దిపూర్‌లోని సీఎస్ఐ వెస్లీ చర్చిలో గురువారం 9వ వార్షికోత్సవ వేడుకలను ప్రెస్బిటర్ ఇన్‌చార్జి, జీడీసీసీ సండే స్కూల్ సెక్రటరీ జి. దినాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జీడీసీసీ చైర్మన్ సామ్యూల్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మహిళలు ప్రత్యేక గీతాలాపన చేశారు. అనంతరం కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

అనంత రామశర్మకు నివాళి

ఖలీల్‌వాడి, మే 23 : సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు, నల్గొండ జిల్లా కార్మిక సంఘం నాయకుడు అనంత రామశర్మ మృతికి జిల్లా నాయకులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సీనియర్ నాయకులు పెద్ది వెంకట్రాములు పూలమాల వేసి నివాళులర్పించారు. రామశర్మ స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. చివరి వరకు నిరాడంబర జీవితాన్ని గడిపారన్నారు. కార్యక్రమంలో రమేశ్‌బాబు, నూర్జహాన్, విఘ్నేష్, మహేశ్, గణేశ్, నరేశ్ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులు, వైకుంఠధామంపై దృష్టి పెట్టాలి..

కోటగిరి, మే 23: ఉమ్మడి కోటగిరి మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎత్తొండ గ్రామాన్ని ఆయన సందర్శించారు. వైకుంఠధామం, కంపోస్ట్ షెడ్డును పరిశీలించారు. వైకుంఠధామంలో అన్ని రకాల వసతులతోపాటు పరిసరాలు శుభ్రంగా ఉండాలన్నారు. డంపింగ్ యార్డును ఉపయోగించాలన్నారు. తడి,పొడి చెత్తను వేర్వేరు ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా సంరక్షించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఉమాకాంత్ ఉన్నారు.

'కుస్తీ' మే సవాల్

చందూర్ మండల కేంద్రంలో రెండురోజులుగా ఎల్లమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. జాతరలో భాగంగా గురువారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి మల్లయోధులు తరలివచ్చారు. గెలిచిన వారికి ఎల్లమ్మ ఆలయ కమిటీ బహుమతులను అందజేసింది.కార్యక్రమంలో జడ్పీటీసీ అంబర్ సింగ్, ఎంపీపీ లావణ్య, వైస్ ఎంపీపీ దశాగౌడ్ , సొసైటీ చైర్మన్ ప్యారం అశోక్, సొసైటీ మాజీ చైర్మన్ మాధవరెడ్డి, ఆలయకమిటీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. –చందూర్ , మే 23

ట్యాంకుల నిర్మాణ పనులు పూర్తి చేయాలి

రుద్రూర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న సీఆర్పీ

రుద్రూర్, మే 23: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న నీటి ట్యాంకుల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సీఆర్పీ అంబర్‌సింగ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న తాగునీటి ట్యాంకు నిర్మాణ పనులను పరిశీలించారు. మండల పరిధిలో 16 పాఠశాలల్లో నీటి ట్యాంకు నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు ఆయన తెలిపారు. సుమారు రూ.40లక్షల నిధులతో పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.

కొడిచెర్లలో బుద్ధ పూర్ణిమ జయంతి

కోటగిరి, మే 23: విశ్వమానవాళికి సహనం, ప్రేమ తత్వం, అహింస, శాంతిని పంచిన మహనీయుడు గౌతమ బుద్ధుడు అని, ప్రతి ఒక్కరూ ఆయన బాటలో నడవాలని పలువురు వక్తలు అన్నారు. గురువారం బుద్ధ పూర్ణిమ జయంతి సందర్భంగా పొతంగల్ మండలం కొడిచెర్ల గ్రామంలోని గౌతమ బుద్ధ విహార్ వద్ద గ్రామ పెద్దలు పంచశీల జెండాను ఆవిష్కరించారు. గౌతమ బుద్ధుడి ఆశయాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు భీమయ్య, గంగారాం, ఈర్వంత్, రాము,యాదవ్‌రావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

వినాయక్‌నగర్, మే 23: జిల్లా కేంద్రంతోపాటు రూరల్ మండలంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలీప్ ఆధ్వర్యంలో నగరంలో దాడులు నిర్వహించారు. స్థానిక ఖిల్లా చౌరస్తా వద్ద గంజాయి విక్రయిస్తున్న సదుల్ల ఖాన్‌ను అదుపులోకి తీసుకొని అతడి వద్ద నుంచి 1.220 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొన్నారు. విచారణలో తాను యండీ యూనస్ వద్ద నుంచి కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు సదుల్లఖాన్ చెప్పడంతో అతడి కోసం గాలిస్తున్నారు. దాడిలో ఎస్సైలు సుస్మిత, సింధు, సిబ్బంది ప్రభాకర్, షబ్బీరుద్దీన్, సగయ్య, దారి సింగ్,సంజయ్ పాల్గొన్నారు.

జన్నేపల్లి రోడ్డు వద్ద..

నిజామాబాద్ రూరల్ మండలం ఖానాపూర్ గ్రామంలోని జన్నేపల్లి రోడ్డు వద్ద టాస్క్‌ఫోర్స్ సీఐ విలాస్ కుమార్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా.. బిహార్ రాష్ట్రానికి చెందిన రుదల్ శర్మ అనే యువకుడు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడు. బ్యాగులో రెండు ప్యాకెట్లలో 1200 గ్రాముల ఎండు గంజాయి లభించినట్లు అధికారులు తెలిపారు. సదరు యువకుడిని అదుపులోకి తీసుకొని నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించారు. తనిఖీల్లో సిబ్బంది సలీం,సాగర్ రావు, కిరణ్ కుమార్, నీలి రాజు, నర్సయ్య చారి, గోపి పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడ్డ నిందితులను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

ఘనంగా తిరుమలయ్య రథోత్సవం

ఇందల్వాయి, మే 23 : మండలంలోని నల్లవెల్లి గ్రామంలో గురువారం తిరుమలయ్య జాతరలో భాగంగా ఘనంగా రథోత్సవం నిర్వహించారు. నల్లవెల్లి వీడీసీ సంఘం ఆధ్వర్యంలో తిరుమల వేంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారికి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రథోత్సవంలో గ్రామపెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం జాతర ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

దుస్తుల కుట్టు కేంద్రం ప్రారంభం

కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్డీవో

డిచ్‌పల్లి, మే 23 : మండలంలోని నడ్పల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో స్కూల్ యూనిఫామ్ కుట్టు కేంద్రాన్ని గురువారం ప్రారంభించినట్లు డీఆర్డీవో సాయాగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 72 స్కూళ్లలోని 9128 మంది విద్యార్థుల కోసం కుట్టు కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి రెండు జతల దుస్తులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీడీ రవీందర్, డీపీఎం సాయిలు, ఏపీఎం రజిత, సీసీలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేయాలి

తూంపల్లిలో డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న పీఆర్ డిప్యూటీ కమిషనర్ వెస్లీ

సిరికొండ, మే 23 : తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువును తయారుచేయాలని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ వెస్లీ అన్నారు. గురువారం మండలంలోని తూంపల్లి గ్రామంలో వైకుంఠధామం, నర్సరీ, క్రీడా ప్రాంగణం, పల్లెప్రకృతివనం, డంపింగ్ యార్డులను ఆయన పరిశీలించారు. గ్రామంలో ప్రజల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డు వద్ద ఎరువు తయారయ్యేలా చూడాలని ఆదేశించారు. తయారైన ఎరువును మొక్కలు పెంచడంలో ఉపయోగించాలని సూచించారు. ఆయన వెంట డీపీవో తరుణ్ చక్రవర్తి, డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, కార్యదర్శి శ్రీకాంత్ ఉన్నారు.

ఇందల్వాయిలో గంగమ్మ జాతర

ఇందల్వాయి, మే 23 : మండల కేంద్రంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గురువారం గంగమ్మ జాతర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం గంగమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు, యజ్ఞం, పూర్ణాహుతి, పుష్పార్చన తదితర కార్యక్రమాలను నిర్వహించారు.అమ్మవారికి గ్రామం నుంచి బోనాలు ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘ సభ్యులు కోరట్‌పల్లి ఆనంద్, మారంపల్లి సుధాకర్, భాస్కర్, శ్రీకాంత్ తదితలు పాల్గొన్నారు.

మద్యపానానికి దూరంగా ఉండాలి

సమావేశంలో ట్రైనీ జడ్జీలు, అధికారులు

మాక్లూర్, మే 23: మండల కేంద్రంలో ఆర్మూర్ ట్రైనీ జడ్జీ వేముల దీప్తి, నిజామాబాద్ ఎక్సైజ్ కోర్టు ట్రైనీ జడ్జి హరిబాబు గురువారం పర్యటించారు. గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజలు మద్యపానానికి దూరంగా ఉండేలా చైతన్యం కలిగించాలని సూచించారు. మైనర్, యువత మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, వారిని తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని, వారు చెడు మార్గంలో నడవకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. రైతులు ధాన్యాన్ని రోడ్లపై పోయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, ధాన్యాన్ని పోయకుండా అధికారులు సూచనలు చేయాలన్నారు. గ్రామ పంచాయతీలో గ్రామానికి సంబంధించిన రికార్డులు, వాటి విధివిధానాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ షబ్బీర్, ఎంపీవో శ్రీనివాస్, ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి రాకేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

'వంట గ్యాస్ సరఫరా చేయాలి'

నవీపేట, మే 23: నవీపేట భారత్ గ్యాస్ ఏజెన్సీపై గురువారం రాంపూర్ మాజీ సర్పంచ్ అల్లం రమేశ్‌తోపాటు ఆ గ్రామానికి చెందిన పలువురు తహసీల్దార్ నారాయణకు ఫిర్యాదు చేశారు. నవీపేట మండల కేంద్రంలో కొనసాగుతున్న భారత్ వంట గ్యాస్ వారం రోజులుగా తమ గ్రామానికి సరఫరా చేయక పోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడిపై చర్యలు తీసుకొని తమ గ్రామానికి గ్యాస్ సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం

- పూజా వస్తువులు విక్రయించేందుకు వేలం వేస్తాం
- దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ

తాగునీటి ట్యాంకును పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ

రెంజల్, మే 23: మండలంలోని కందకుర్తి గోదావరినది పుష్కర క్షేత్రం వద్ద 'భక్తుల గొంతెండుతోంది', 'నీళ్లున్నా..నిరుపయోగంగా ట్యాంకులు' శీర్షికన నమస్తే తెలంగాణలో ప్రచురితమైన వరుస కథనాలతో ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించారు. త్రివేణి సంగమంలో భక్తులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను సత్వరమే పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈకి జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ఫోన్‌లో సూచించారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం కందకుర్తి పుష్కర క్షేత్రాన్ని దేవాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సుప్రియతోపాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ గబ్బర్‌సింగ్, కార్యదర్శి శరత్ చంద్ర సందర్శించారు. నిరుపయోగంగా ఉన్న తాగునీటి ట్యాంకులను పరిశీలించారు. కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రాన్ని పర్వదినాల్లో దర్శించే భక్తుల తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. నిరుపయోగంగా ఉన్న నాలుగు మినీ ట్యాంకులకు త్వరలోనే బిరడాలను భిగించి తాగునీటిని సరఫరా చేస్తామని, భక్తులు అందోళన చెందవద్దని అసిస్టెంట్ కమిషనర్ కోరారు. నది ఒడ్డున వెలిసిన పూజ సామగ్రి దుకాణాలకు త్వరలో వేలం వేస్తామని, వచ్చిన ఆదాయ వనరులతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కొన్నేండ్ల క్రితం ఈదురు గాలులకు శివాలయం ఎదుట ధ్వజ స్తంభం నేలకొరిగిందని, దానిని పునః ప్రతిష్ఠించేందుకు నిధుల మంజూరుకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని స్పష్టం చేశారు. అసిస్టెంట్ కమిషనర్ పరిశీలకురాలు కమల, ఈవో వేణు, మేక సంతోష్‌కుమార్, ఎంపీటీసీ అసద్‌బేగ్, మాజీ ఉప సర్పంచ్ యోగేశ్, గంగారాజు, రమేశ్, శ్రీనివాస్, సురేశ్ తదితరులు ఉన్నారు.

అంబులెన్స్‌లో ఆకస్మిక తనిఖీ

1962 అంబులెన్స్ వద్ద ప్రాజెక్టు మేనేజర్, సిబ్బంది

బాల్కొండ, మే23: స్థానిక 1962 అంబులెన్స్‌ను స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ భాగీశ్ మిశ్రా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1962 అంబులెన్స్ ద్వారా అత్యుత్తమ వైద్య సేవలను మూగజీవాలకు అందించాలని సూచించారు. అంబులెన్స్ వివిధ రకాల పరికరాల పనితీరును మందులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా పోగ్రాం మేనేజర్ రవి, ఎగ్జిక్యూటివ్ విజయేందర్, డాక్టర్ అనిల్‌రెడ్డి, పారావేట్ శ్రీకాంత్, హెల్పర్ మహేందర్, కెప్టెన్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

బాలికపై హత్యాయత్నం?

నిజామాబాద్ దవాఖానలో వైద్యులతో మాట్లాడుతున్న ఎడపల్లి ఎస్సై

ఎడపల్లి, మే23: మండలంలోని జాన కంపేట్ శివారులోని నిజాంసాగర్ కెనాల్ కట్టపై మల్లన్న గుడి వద్ద గురువారం వేకువ జామున ఓ బాలిక గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉంది. ఉదయం వాకింగ్‌కు వచ్చిన కొందరు గ్రామస్తులు చూసి ఎడపల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని బాలికను పరీక్షించి చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఎస్సై వంశీకృష్ణారెడ్డి ని వివరణ కోరగా బాలిక ప్రస్తుతం చికిత్స పొందుతోందని, మాట్లాడలేని స్థితిలో ఉందని తెలిపారు. పోలీసు బృందాలు వివరాల సేకరణలో ఉన్నాయని అన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి

మోర్తాడ్, మే23: ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు తమ కళాశాలలో చేరాలని కోరుతూ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు గురువారం మోర్తాడ్‌లో ప్రచారం నిర్వహించారు. కళాశాలలో అధునాతన గదులతోటు ప్రయోగశాలలు, లైబ్రరీ లాంటి సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. ఈ కళాశాల సామాజికే సేవ, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని, జిజ్ఞాస స్టడీ ప్రాజెక్ట్‌లకు విద్యార్థుల ఎంపిక, కేరీర్ గైడెన్స్‌ను ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాగు నీటి సమస్య పరిష్కరించాలి

బోధన్ రూరల్, మే23: సాలూరా మండల కేంద్రంలోని 12, 13వ వార్డుల్లో తాగు నీటిలో దుమ్మూధూలితోకూడిన వ్యర్థాలు వస్తున్నాయని, శుద్ధమైన నీరు అందేలా చూడాలని కోరుతూ కాలనీ వాసులు గురువారం సాలూరా తహసీల్దార్, గ్రామ ప్రత్యేక అధికారి రమేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేండ్ల నుంచి వాటర్ తాగు నీటిలో వ్యర్థాలు వస్తున్నాయని అన్నారు. ఎవ్వరికి చెప్పినా పట్టించుకోవడం లేదని, ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు రమేశ్, హరి లాల్, రాజు, నరేశ్, సోహెల్, వినయ్, ఆకాశ్ పాల్గొన్నారు.

రెంజల్ మండలంలోని కందకుర్తి వద్ద పట్టాభిరామాలయం, నర్మదేశ్వర, వేంకటేశ్వర ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని గురువారం సీతారాం త్యాగి మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా హాజరై పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. – రెంజల్, మే23

పల్లె ప్రగతి పనులు పరిశీలన

ఏర్గట్ల, మే 23: బట్టాపూర్, తడ్‌పాకల్ గ్రామాల్లో చేపట్టిన క్రిమి టోరియం, డంపింగ్ యార్డు, నర్సరీ తదితర పల్లె ప్రగతి పనులను ఎంపీవో శివచరణ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీల్లో మొక్కలు వాడిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామంలో మురికి కాల్వల సుభ్రతపై దృష్టి సారించలని, తాగు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు అకుల రవి, శ్రీకాంత్‌కు సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులతోపాటు ఫీల్డ్ అసిస్టెంట్లు కొండ రామకృష్ణ, బడగిరి అనిల్ యాదవ్ ఉన్నారు.

గోశాలకు దాణా అందజేత

శక్కర్‌నగర్,మే 23: బోధన్ ఏకచక్రేశ్వర గోశాలకు పట్టణంలోని విజేత జూనియర్ కళాశాల, సాయి విజేత మహిళా జూనియర్ కళాశాల డైరెక్టర్లు అంజనారెడ్డి రమణారెడ్డి దంపతులు విరాళం అందజేశారు. వారి వివాహ వార్షికోత్సవంలో భాగంగా ఈనెల 23న రాత్రి గోశాలలో గోపూజ నిర్వహించి, గోమాతలకు రూ.5వేల విలువైన వివిధ రకాల దాణాను కొనుగోలు చేసి అందజేశారు. గోశాల కమిటీ ప్రతినిధులు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో గోశాల కమిటీ అధ్యక్షుడు నేపాల్‌సింగ్, ప్రధాన కార్యదర్శి వినోద్ పట్వారీ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దొంగల బెడదను అరికట్టండి

మోర్తాడ్, మే23: దొంగల కారణంగా వ్యవసాయం చేసుకోవడం భారంగా మారిందని, దొంగల బెడదను అరికట్టాలని కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్ గ్రామానికి చెందిన రైతులు కోరుతున్నారు. కమ్మర్‌పల్లి పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. వరదకాలువను ఆనుకుని 50 మంది వరకు రైతులము వ్యవసాయం చేస్తున్నామని, అర్ధరాత్రుల్లో దొంగలు మోటార్లు, వైర్లు, పైపులు, వ్యవసాయ పనిముట్లు దొంగిలించుకు పోతున్నారని పేర్కొన్నారు.

సంక్షిప్తంగా..

- **బీరు సీసాతో ఒకరిపై దాడి** నవీపేట,మే 23: నవీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జలాల్‌పూర్ గ్రామంలో ఒకరిపై బీరు సీసాతో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జలాల్‌పూర్ గ్రామానికి చెందిన చింటూ తాగిన మైకంలో అదే గ్రామానికి చెందిన సమీప బంధువైన చందుపై గురువారం రాత్రి బీరు సీసాతో దాడి చేశాడు. దీంతో చందు ముక్కుకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే దవాఖానకు తరలించారు. ఇటీవల చింటూ నాయయమ్మ మృతి చెందింది. ఈ నేపథ్యంలో తాగిన మైకంలో ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇద్దరి మధ్య ఘర్షణ వాస్తమేనని స్థానిక ఏఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.
- **28న ద్విచక్ర వాహనాల వేలం-** మోర్తాడ్, మే23: వివిధ కేసుల్లో పట్టుబడిన రెండు ద్విచక్రవాహనాలకు ఈనెల 28న మోర్తాడ్ ఎక్సైజ్ కార్యాలయం వద్ద వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ గుండప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 25 శాతం ఈఎండీ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, AMRAJ THIRUPATHI S/O AMRAJ NARAYANA,H.NO:3-1,KAMMAR PALLY, NZB(D).CHANGED MY SURNAME AS AMRAJI THIRUPATHI S/O AMRAJI NARAYANA

NTZ-324688

WANTED

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.

NT-327722-All

పాస్‌పోర్ట్ పోయినది

★KATTE SRINIVAS SWAMY, R/O BHEEMGAL NZB(D). నా యొక్క పాస్‌పోర్ట్ నెం. 9546543. నిజామాబాద్ నుండి భీమ్‌గల్‌కు ఆటోలో వెళ్లుచుండగా పోయినది. దొరికినవారు Pls Call: 9505025232

NTZ-324690

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ 4 లైన్ క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే. "మీరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/- GST వర్తించును

ఘనంగా బుద్ధ జయంతి

మోర్తాడ్/రెంజల్/ఆర్మూర్‌టౌన్, మే23: కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ గ్రామంలో గురువారం గౌతమ బుద్ధుని జయంతి మాల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జ్యోతి ప్రజ్వలన, బుద్ధవందనం, పంచశీల, త్రిశరణ పాటించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ....గౌతమబుద్ధుడు సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని అన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సుంకరి విజయ్, దేవి హరీశ్, రమేశ్, శంకర్, గోపి, శ్రీనివాస్, రంజిత్, శేఖర్, క్రాంతి, ప్రసాద్, అశోక్, శ్రీధర్, లిఖిత, కళావతి, లక్ష్మి, బాలమణి పాల్గొన్నారు. రెంజల్ మండలంలో పలు గ్రామాల్లో బుద్ధ పౌర్ణమి ఘనంగా నిర్వహించారు. గయలో బోధి వృక్షం కింద తపస్సు చేసి సిద్ధార్థుడు జ్ఞానోదయం పొందిన పున్నమి రోజున బుద్ధ పౌర్ణమిగా ఏటా నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీలో దళిత సంఘాల ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుని జయంతి నిర్వహించారు. కార్మిక కార్యక్రమంలో సంఘం నాయకుడు పింజా అశోక్, ప్రదీప్, ప్రభాకర్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ గ్రామంలో గౌతమ బుద్ధుని జయంతిని నిర్వహిస్తున్న మాలసంఘం సభ్యులు